

ములగాడ విలేజ్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించిన గెడ్డ



శ్రీహరిపురంలో రూ.48 లక్షలతో నిర్మించిన గెడ్డ



వెంకటాపురంలో అధ్వానంగా కల్వర్టు



వెంకటాపురంలో ప్రధాన గెడ్డ వద్ద నిర్మించిన కల్వర్టు

ప్రగతి పథం



ఏకేసీకాలనీలో రూ. 50 లక్షలతో నిర్మించిన గెడ్డ



గెడ్డలు ,పెద్ద కాలువల నిర్మాణం

తప్పిన మురుగు కష్టాలు

హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు

గోపాలపట్నం/మల్కాపురం: వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం వచ్చిన తర్వాత పేదల బతుకుల్లో వెలుగులు వచ్చాయి. అభివృద్ధి పనులు, సం **క్షేమ పథకాలతో పేదలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. అందులో భాగంగా మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేశా రు. నివాస ప్రాంతాల్లో ఉండే కాలువలు, గెడ్డలను ఆధునికీకరించారు. ఇందుకు కోట్లాది రూపాయలు వెచ్చించారు. దీంతో పలు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి ఉన్న దుర్గంధం, మురుగునీరు, చెత్త సమస్యకు చెక్ పడింది. తమ ప్రాంతాలు** పరిశుభ్రంగా మారడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరగడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో 2019 నుంచి ఇంత వరకు **జీవీఎంసీ అధికారులు ప్రజల సౌకర్యార్థం రోడ్ల నిర్మాణంతో పాటు కాలువలు, గెడ్డల నిర్మాణలు, అవసరమైన చోట్ల రక్షణ గోడలు** నిర్మించారు. అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేశారు. దీంతో మురుగునీరు సాఫీగా దిగువ ప్రాంతాలకు వెళుతోంది. వర్షాలు వచ్చినా లోతట్టు ప్రాంత వాసులు ప్రశాంతంగా ఉండగలుగుతున్నారు. రక్షణ సంస్థల పరిధిలో సమస్యలను పరిష్కరించడానికి కూడా చర్యలు చేపట్టారు.



గోపాలపట్నం ప్రశాంతినగర్ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద శిథిలావస్థలో గెడ్డ కల్వర్టు

పశ్చిమ నియోజకవర్గం నుంచి రెండు మార్లు, నియోజక వర్గాల పునర్విభనకు ముందు పెందుర్తి నుంచి ఒక సారి ఎమ్మెల్యేగా పని చేసిన వ్యక్తి అభివృద్ధిని గాలికి వదిలేశారు. ఆయన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మురుగు పారుదలకు కీలకమైన కాలువల అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ మురుగు నిలిచి పోయి ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడేవారు.



నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత విశాలంగా కల్వర్టు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశ్చిమ నియోజకవర్గంలో వందలాది కోట్ల రూపాయిలతో అభివృద్ధి పనులు చేపట్టింది. అందులో ప్రధానంగా గెడ్డల ఆధునికీకరణకు పెద్దపీట వేసింది. చాలా ప్రాంతాల ప్రజల మురుగు కష్టాలకు చెక్ పెట్టింది. నియోజక వర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే లేకపోయినా నాలుగున్నరేళ్లలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

92, 58, 40 వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు

జీవీఎంసీ 92వ వార్డులో దారుణంగా ఉన్న ప్రధాన **గెడ్డను అభివృద్ధి** చేశారు. ఎల్‌జీ పాలిమర్స్ గోడకు **ఆనుకుని సుమారు** 300 మీటర్లకు పైగా గెడ్డను విస్త **రించారు.** వార్డులో ప్రధాన గెడ్డ, కల్వర్టులు **నిర్మాణానికి** రూ.77లక్షలు జీవీఎంసీ నిధులు వెచ్చించారు. అలాగే ప్రశాంతినగర్ పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు తొలగించి నూతనంగా నిర్మించారు. ఇందుకు జీవీఎంసీ నిధులు రూ.14 లక్షలు వెచ్చించారు. రహదారిని కూడా నిర్మించారు.

- జీవీఎం 58వ వార్డు ములగాడ విలేజ్‌లో కలగా మిగిలిన గెడ్డ నిర్మాణ పనులు రూ. కోటితో చేపట్టారు.
- గుల్లలపాలెం వద్ద రూ.కోటి 5 లక్షలతో కాలువ, కల్వర్టుల నిర్మాణం
- శ్రీహరిపురం ప్రాంతంలో రూ.48 లక్షలతో డ్రైన్ల నిర్మాణం.
- రామ్‌నగర్ ప్రాంతంలో రూ. 43 లక్షలతో గెడ్డల రక్షణ గోడల నిర్మాణం.
- 40వ వార్డు ఏకేసీ కాలనీలో రూ. 50 లక్షలతో గెడ్డ రక్షణ గోడ, కాలువల నిర్మాణం.
- హిమాచల్‌నగర్‌లో రూ.18.50 లక్షల వ్యయంతో పెద్ద కాలువల నిర్మాణం.
- వుడాకాలనీలో రూ. 18 లక్షలతో కాలువ నిర్మాణం.
- అచ్చినాయుడుతోట ప్రాంతంలో రూ.10 లక్షలతో కాలువ నిర్మాణం.
- ప్రకాష్‌నగర్‌లో 18.50 లక్షలతో పెద్ద కాలువ నిర్మాణం.
- గుల్లపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ ఏరియాలో రూ. 13.10 లక్షలతో కాలువ నిర్మాణం.
- క్రాంతినగర్ కొండ ప్రాంతంలో రూ. 9.80 లక్షలతో రక్షణగోడ నిర్మాణం.
- జనతాకాలనీ,ఇందిరాకాలనీ కొండ ప్రాంతంలో రక్షణ గోడల నిర్మాణానికి రూ.19.80 లక్షలు.

గెడ్డ ఆధునికీకరణతో ఇబ్బందులకు చెక్



ఏళ్ల నుంచి మా ప్రాంతంలో గెడ్డ అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో వర్షం పడితే నీరు పల్లపు ప్రాంతాల్లోకి చేరి ఇబ్బందులు పడేవాళ్లం. మురుగు సక్రమంగా పారగా నిలిచిపోయి దుర్వాసన వెదజల్లేది. దీంతో రెండేళ్ల కింద సమస్యను మా వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లాం. వారు స్పందించి అభివృద్ధి పనులు చేపట్టారు. ఇది ఆధునికీకరించడంతో మా గ్రామ ప్రధాన సమస్య తీరినట్లయింది.

– గొంతిన నాగరాజు, వెంకటాపురం

కళ్ల ముందే అభివృద్ధి



గెడ్డ సమస్యే కాదు గ్రామంలో పలు సమస్యలు తీరుతున్నాయి. ఎన్నో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని వాటిని కూడా అభివృద్ధి చేస్తున్నారు. గెడ్డల ఆధునికీకరణే కాకుండా రహదారులు, కాల్వలు కల్వర్టు పనులు చేపడుతున్నారు. అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తోంది. మరిన్ని పనులు ప్రగతిలో ఉన్నాయి.

– లోకేష్, వెంకటాపురం

క్లుప్తంగా

నిజాయితీగా ఓటు వేయండి



ఓటు విలువపై ద్విచక్ర వాహనం ద్వారా ప్రచారం చేస్తున్న కృష్ణ

మల్కాపురం: ఓటు వజ్రాయుధం.. దాన్ని ప్రతి ఒక్క ఓటరు సద్వినియోగం చేసుకోవాలని సామాజిక సేవా కార్యకర్త రాళ్లపేట కృష్ణ అన్నారు. తెలంగాణలో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆంధ్రలోని తెలంగాణ ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ద్విచక్ర వాహనంపై ఆయన ప్రచారం చేస్తున్నారు. శ్రీహరిపురం వద్ద శనివారం ఉదయం మొదలైన యాత్రలో కృష్ణ మాట్లాడుతూ ఓటర్లు డబ్బు,ఇతర కానుకలకు ప్రభావితం కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హైవేపై వాహనాలు నిలిపితే చర్యలు



కారు ఫొటో తీస్తున్న ఏఎస్‌ఐ లక్ష్మణరావు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లో జాతీయ రహదారిపై వాహన నిలిపే వారిపై చర్యలకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు. ట్రాఫిక్ సీఐ ఎం. అప్పారావు ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ లక్ష్మణరావు సిబ్బందితో శనివారం ఎన్‌ఏడీ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేశారు. హైవేపై నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ చేసిన వాహనాలకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఏడీ ఏరియాలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగంపై అవగాహన ముఖ్యం



రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న భాగ్యలక్ష్మి, విద్యార్థినులు

మల్కాపురం: భారత రాజ్యాంగంపై బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల హక్కులు, ప్రభుత్వ అధికారుల సమన్వయమే రాజ్యాంగమన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య ఎటువంటి సంబంధం ఉండాలో ఇది చెబుతుందన్నారు. ఇలా పలు అంశాలు రాజ్యాంగంలో మహనీయులు పొందుపరిచారని, దీనిపై అందరికీ అవగాహన అవసరమని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థినులు పాల్గొన్నారు.

భెల్ ఈడీగా జితేందర్

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఇన్‌చార్జి జీఎం ఎస్.జితేందర్ రెడ్డి ఈడీగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనకు ఏఐటీయూసీ యునైటెడ్ ఫ్రంట్ (గుర్తింపు యూనియన్) ప్రతినిధులు అభినందనలు తెలిపారు. పరిపాలనా భవనంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంస్థ జీఎంలు గౌరీ శంకర్, ఎం.ఎస్.శ్రీనివాసరావు, ఏజీఎంలు కండపాల్, మండల్, గుర్తింపు యూనియన్ ఉప గౌరవ అధ్యక్షుడు కొల్లి దేముడు, అధ్యక్షుడు బొండ బాబూరావు, సుభాకర్ సాహు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధితురాలికి రేషన్ సరకులు, నగదు అందిస్తున్న కోరాడ శ్రీను

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి ఓ పూరిల్లు అగ్నికి ఆహుతైంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీహరిపురం సమీపంలోని రామ్‌నగర్ వద్ద ధనాల సూర్యతల్లికి చెందిన పూరింటికి శుక్రవారం అర్ధరాతి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఆ సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న సూర్యతల్లి కుటుంబ సభ్యులు భయం దోళనతో ఇంటి నుంచి బయటకు వచ్చి కేకలు వేశారు.స్థానిక యువత,చుట్టుపక్కల వారు మంటలను అదుపుచేసే యత్నం చేశారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు, బీరువాలోని విలువైన పత్రాలు,నగదు,ఇతర ఆభరణాలు దగ్ధమయ్యాయి. ఎవరో తన ఇంటికి నిప్పు పెట్టి ఉంటారని బాధితురాలు ఆరోపిస్తుంది. విషయం తెలుసుకున్న శ్రీదేవి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి కోరాడ శ్రీను నెల రోజులకు సరిపడే నిత్యావసర సరకులు,కొంత నగదు అందించారు. ఘటనా స్థలానికి మల్కాపురం పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు.దీనిపై విచారణ చేస్తామని,దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

కాలుష్యం సమస్యకు పరిష్కారం చూపండి

మల్కాపురం: పలు పరిశ్రమల నుంచి నిత్యం వెలువడుతున్న కాలుష్యం వల్ల వాటికి అతి సమీపాన నివసిస్తున్న తాము శ్వాసకోస, చూపు మందగించడం వంటి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నామని 58వ వార్డు చిన్న ములగాడ, ములగాడ ప్రాంతాల వాసులు శనివారం ఆందోళన చేపట్టారు. చిన్న ములగాడ వద్ద గ్రామస్తులు మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి అలూఫ్లోరైడ్, కోరమాండల్, హెచ్‌పీసీఎల్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం బారిన పడి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈమేరకు కలెక్టర్, పొల్యూషన్ బోర్డు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు తమ గ్రామ పెద్దలతో కలిసి వెళ్లి సమస్యను వివరిస్తామని తెలిపారు. అనంతరం గ్రామ పెద్దలకు వినతిపత్రం అందజేశారు.

1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా



59వ వార్డులో జాబ్ మేళాపై ఆటో ద్వారా చేస్తున్న ప్రచారం

విశాఖ విద్య/మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా డిసెంబర్ 1, 2 తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఏపీఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోవకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 59వ వార్డు లోని జింక్ హనుమాన్ టెంపుల్ దరి ఎంఏవీపీ జూనియర్ కాలేజీ(ఆండాలమ్మ కాలేజ్) ఆళ్వార్ పాలిటెక్నిక్, గాజువాక బస్‌డిపో ప్రాంతంలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆటోమొబైల్, రిటైల్, టెక్స్‌టైల్స్, హెల్త్‌కేర్, ఫార్మా, ఇన్సూరెన్స్, ఐటీ, బీపీవో, ఎడ్యుకేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇలా వివిధ రంగాలకు చెందిన 50 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని ఆడారి ఆనంద్ కుమార్ వెల్లడించారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనే నిరుద్యోగ అభ్యర్థులు ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత మధ్యాహ్నభోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులు ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రత్యేకంగా యాప్ రూపొందించారు. దీనిని ప్రతీ ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9000818467, 9000938467 నంబర్లుకు సంప్రదించాలని సూచించారు.

సాయిమందిరంలో పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



అలంకరణలో సాయిబాబా



ఏపీఎస్‌ఈబీ కాలనీలో సాయిబాబా మందిరం

రేపు ఆలయంలో సత్యవ్రతం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజల నిర్వహణకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో సాయి సత్య వ్రతం వైభవోపేతంగా జరిపించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తుల భాగస్వామ్యంతో ఇటీవల ఆలయానికి రంగులు వేసి, సుందరంగా తీర్చిదిద్దారు.

రహదారిపైనే స్కూల్ బస్సుల పార్కింగ్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సులను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రోజంతా ఇదే రహదారిపై వాటిని ఉంచడంతో ఆ దారిలో ప్రయాణించే కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలకు చెందిన బస్సులు, ఆటోలను వారికి సంబంధించిన స్థలంలోనే పార్కింగ్ చేసుకోవాల్సి ఉన్నప్పటికీ రోడ్డుపైనే నిలువుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

చిన్నారులకు డ్రెస్, షూస్ పంపిణీ



డ్రెస్, షూస్ అందిస్తున్న శామ్యూల్

సింధియా: ద్వారకానగర్‌లోని విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ఆదివారం జరగనున్న బిగెస్ట్ డ్యాన్స్ కాంపిటేషన్ అండర్–14 విభాగంలో పాల్గొంటున్న పారిశ్రామిక ప్రాంత జైభీమ్ బాక్సింగ్ డ్యాన్సింగ్ క్లబ్ పిల్లలకు శనివారం డ్రెస్, షూస్, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. షిప్‌యార్డ్ ఐఎన్‌టీయూసీ ఆఫీస్ బేరర్ శామ్యూల్, మల్కాపురం సీఐ దేముడుబాబు, బాక్సర్ రామారావు తదితరులు చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేటితరం చిన్నారులు ఖాళీ సమయం దొరికితే మొబైల్స్‌కు అతుక్కుపోతూ జ్ఞాపకశక్తిని కోల్పోతున్నారన్నారు. తల్లిదండ్రులు చిన్నారుల ప్రతిభను గుర్తించి వారికి నచ్చిన విభాగంలో తర్ఫీదునిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. చిన్నారులకు కోచ్‌గా గణేష్ రాబిన్స్ వ్యవహరిస్తున్నట్లు జైభీమ్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు.

సాహితీ సముద్ధరణకు విశాలాంధ్ర విశేష కృషి



పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న చలసాని రాఘవేంద్రరావు తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర సంస్థ 50వ దశకం నుంచి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్ర రావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి తీసుకురావడంలో విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ బుక్ ఫెస్టివల్ పేరుతో నగరంలో ప్రదర్శన నిర్వహించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాలేదని, ఆ లోటును భర్తీ చేయడంలో విశాలాంధ్ర ప్రదర్శన ముందు వరుసలో నిల్చుందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి. మనోహర్‌నాయుడు మాట్లాడుతూ విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని సాహితీప్రియులు, రచయితలు, విద్యార్థులు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రచయిత ఆచార్య సూర్యారావు, ఆచార్య సిమ్మన్న, హిమాన్షు బుక్ డిపో ప్రసాద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు, సిబ్బంది మూర్తి, అనిల్, రచయితలు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకం

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక ప్రగతికి కార్మికులే కీలకమని, అటువంటి కార్మికులను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతూ పోవడం సరికాదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం బాగుపడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1017వ రోజు, శనివారం సంస్థకు చెందిన డబ్ల్యూఎండీ, యుటిలిటీ, ఏడీఎం, టీపీ, టీటీఐ విభాగ కార్మికులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను 100 శాతం అమ్మాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలన్నారు.